సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 26 । మే । 2023



ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం

ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో మూగ జీవాలు బలవుతున్నాయి.

- 8లో ▸



ఆపదలో ఆప్తులు

ఆపద సమయంలో రోగులను ఆస్పత్రికి తరలించడంలో అంబులెన్స్‌ల పైలట్‌లు ఎంతో కృషిచేస్తున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
42.2 /30.4

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



కామారెడ్డి క్రైం: జిల్లాలో కిశోర బాలికలలో రక్తహీనత నివారణకు, బాల్యవివాహాల నిర్మూలనకు పనిచేయటానికి వచ్చిన టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, యూనిసెఫ్ సమస్త ప్రతినిధులకు జిల్లా అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం బాల్యవివాహాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. కిశోర బాలికలలో రక్తహీనత నివారణకు కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, యూనిసెఫ్ సమస్త ప్రతినిధులు కృష్ణ, విద్యాలతలు కిశోర బాలికలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



నిజాంసాగర్(జుక్కల్): బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార అన్నారు. గురువారం మండలంలోని గోర్గల్‌లో బీజేపీ మండల కార్యవర్గ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ఎన్నికల సమయం కావడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు బోయిని సాయిలు, మహిళా అధ్యక్షురాలు గోలి స్వరూప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఖలీల్‌వాడి : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న పలువురు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. 1996, 1998 బ్యాచ్‌కు చెందిన 28 మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. వీరిలో నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 20 మంది, కామారెడ్డి జిల్లాకు చెందిన 8 మంది ఉన్నారు. బాసర జోన్‌తో ఆదిలాబాద్‌కు చెందిన పోలీస్‌కానిస్టేబుళ్లకే పదోన్నతులు లభించాయని, జిల్లాలోని పోలీసులు నష్టపోయినట్లు కానిస్టేబుళ్ల మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవితతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జిల్లాకు చెందిన వారికి పదోన్నతి లభించింది.

ఎంసెట్‌లో 194వ ర్యాంక్ సాధించిన శ్రీఅర్షిత్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తృప్తి వాసు కుమారుడు తృప్తి శ్రీ అర్షిత్ ఎంసెట్‌లో 194వ ర్యాంక్‌ను సాధించాడు. శ్రీఅర్షిత్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో చదివాడు.

గ్రంథాలయాల్లో అన్ని వసతులు కల్పిస్తాం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గ్రంథాలయాల్లో అన్ని వసతులు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి గ్రంథాలయానికి కొత్తగా వచ్చిన పుస్తకాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని మెటీరియల్‌ను తెప్పించడం జరిగిందన్నారు. ఎల్లారెడ్డి గ్రంథాలయంలో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఓన్లీ వాట్సాప్ కాల్స్!

- ఫోన్ మాట్లాడాలంటే జంకుతున్న నేతలు
- ఏది మాట్లాడినా వైరల్ చేస్తున్నారన్న భయం
- నీడను కూడా నమ్మలేని పరిస్థితి
- ఎన్నికల సమయం కావడంతో జాగ్రత్తలు



సాక్షి, కామారెడ్డి: 'ఒక ఐడియా మీ జీవితాన్నే మార్చేస్తుంది' అంటూ అప్పట్లో ఓ సెల్యూలర్ కంపెనీ మార్కెటింగ్‌లో భాగంగా జనంలోకి తీసుకువెళ్లింది. ఇప్పుడు 'ఒక్క ఫోన్ కాల్ తమ రాజకీయ జీవితాన్ని అతలాకుతలం చేస్తుంది' అంటున్నారు మన నేతలు. ఎందుకంటే ఎవరితోనైనా ఫోన్‌లో కుల్లం ఖుల్లా మాట్లాడితే అది రికార్డు చేసి ఎక్కడ తమను రోడ్డున పడేస్తారోనన్న భయం నేతలను వెన్నాడుతోంది. సాధారణ ఫోన్‌కాల్స్ మాట్లాడితే సులువుగా రికార్డు చేయవచ్చు. అలాగే వీడియో కాల్స్ మాట్లాడినా రికార్డు చేయవచ్చు. అదే వాట్సాప్ కాల్ మాట్లాడితే రికార్డు చేయడం సాధ్యం కాదు కాబట్టి చాలా మంది లీడర్లు ఎవరితోనైనా వాట్సాప్ కాల్‌లోనే మాట్లాడుతున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో కూడా చాలామంది సాధారణ ఫోన్ కాల్ వస్తే కట్ చేసి మరీ వాట్సాప్ కాల్ చేస్తున్నారు. కొందరైతే ఫోన్ ముట్టుకునేందుకే వెనకడుగు వేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు ఎవరితోనైనా ఫోన్ మాట్లాడేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తప్పనిసరి అయితేనే సాధారణ ఫోన్‌లో అది కూడా ముక్తసరిగా మాట్లాడుతున్నారు.

ఎవరినీ నమ్మలేకపోతున్నామంటున్న లీడర్లు..

మనోళ్లే మనతో తియ్యగ మాట్లాడి, ఏదైనా కాంట్రవర్సీ మాట్లాడిన వాటిని రికార్డు చేసి తమను ఇబ్బందులకు గురిచేస్తారన్న భయం నేతలను వెన్నాడుతోంది. ఎవరిని నమ్మాలో తెలియడం లేదని పలువురు లీడర్లు బాహాటంగానే చెబుతున్నారు. ఒక్కోసారి నీడను కూడా నమ్మే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. కొందరు ఫోన్ రికార్డు ఆన్ చేసుకుని కూడా వస్తున్నారని, దీంతో అనుమానంతో ముక్తసరిగా మాట్లాడి పంపిస్తున్నామన్నారు.

వాట్సాప్ కాల్స్ ద్వారానే..

కొందరు లీడర్లు వాట్సాప్ కాల్స్ మాట్లాడుతున్నారు. వాట్సాప్ కాల్స్ రికార్డు చేయడం సాధ్యం కాదనే ఉద్దేశంతో అలా చేస్తున్నారు. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఏ చిన్న పొరపాటు జరిగినా మొదటికే మోసం వస్తుందన్న భయంతో సాధారణ ఫోన్ కాల్స్ మాట్లాడడం లేదు. పది మంది జమ అయిన చోట కూడా జాగ్రత్తగా మాట్లాడుతున్నారు. ప్రత్యర్థులు ఏ అవకాశాన్ని వదులుకోరన్న ఉద్దేశంతో చాలా మంది లీడర్లు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏది ఏమైనా అన్ని పార్టీల నేతలకు ఫోన్ ఫోబియా పట్టుకుంది.

ఫోన్ వస్తే మాట్లాడలేని పరిస్థితి..

ఎమ్మెల్యేలతో పాటు మండల, జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు ఫోన్‌కాల్స్‌కు భయపడుతున్నారు. తమ పార్టీ కార్యకర్తనే, తమ పార్టీ నాయకుడే తమతో ఏదో ఒకటి మాట్లాడి, ఏదైనా నోరు జారితే రికార్డు చేసి బయటకు వదులుతారన్న భయం చాలా మందిని వెన్నాడుతోంది. కొత్తగా వచ్చే నంబర్లే కాదు, నంబర్లు ఫీడ్ అయి ఉన్న వారి కాల్స్ కూడా మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. ఏదైనా విషయం మాట్లాడాల్సి వస్తే వచ్చి కలవమని చెబుతున్నారు.

రికార్డు చేసి.. వైరల్ చేస్తూ..

ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడిన వాటిని రికార్డు చేసి అందులో ఎవరి గురించైనా తప్పుగా మాట్లాడితే వైరల్ చేస్తుండడం నేతలకు శాపంగా మారింది. ఫోన్ కాల్సే కాదు కలిసి మద్యం సేవిస్తున్నపుడు, ఎక్కడో ఓ చోట రాజకీయాల గురించి మాట్లాడుతున్నపుడు ఫోన్ రికార్డు బటన్ నొక్కి కూర్చుంటున్నారు. ఎవరు ఫోన్‌ను రికార్డు చేసి ఎవరికి పంపుతారో తెలియని పరిస్థితి నెలకొంది. కామారెడ్డి నియోజకవర్గంలో అప్పట్లో ఓ పార్టీకి చెందిన నాయకుడు తమ పార్టీ పరిస్థితి, నాయకుల గురించి మాట్లాడిన అంశాలను ఎవరో ఒకరు రికార్డు చేసి ప్రత్యర్థులకు అప్పగించడంతో దాన్ని వైరల్ చేశారు. ఇటీవల కామారెడ్డిలో ముఖ్య ప్రజాప్రతినిధి రైతుల పక్షాన మిల్లర్లను నిలదీసి, ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహానికి గురైన సదరు ప్రజాప్రతినిధి మిల్లు గుమస్తాపై చేయి చేసుకున్న వ్యవహారానికి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయ్యింది. మాస్టర్ ప్లాన్ వివాదం కొనసాగుతున్న సమయంలో ఎల్లారెడ్డి నియోజక వర్గానికి చెందిన ఓ పార్టీ నేత కార్యకర్తతో మాట్లాడిన మాటలకు సంబంధించి వాయిస్ రికార్డు చేసి వైరల్ చేశారు. మాచారెడ్డి మండలంలో ఓ గ్రామ స్థాయి ప్రజాప్రతినిధి సెల్‌ఫోన్ పడిపోయిందో, తస్కరించారో తెలియదు కానీ ఆ ఫోన్‌లోని కాల్ రికార్డులు వివాదాలకు కారణమయ్యాయి. నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధి గురించి నోరు జారినవి, గ్రామానికి చెందిన పలువురి గురించి, ఉద్యోగుల గురించి మాట్లాడిన దురుసుమాటలన్నీ బయటకు వచ్చాయి. ఇటీవల గాంధారి మండలంలో దళితబంధు ద్వారా లబ్ధి చేకూరుస్తామంటూ అధికార పార్టీకి చెందిన వారు డబ్బులు తీసుకున్నారంటూ ఓ కార్యకర్త వీడియోలో మాట్లాడి వైరల్ చేశాడు. జుక్కల్ నియోజకవర్గంలోనూ పలు అంశాలపై రికార్డులు వైరలయ్యాయి. బాన్సువాడలో భూకబ్జాలు, ఇసుక దందా గురించి ఓ పార్టీకి చెందిన వారు మరో పార్టీకి చెందిన వారిని టార్గెట్‌గా చేస్తూ వీడియోలు వైరల్ చేశారు.

జూన్ 5 నుంచి 'ధరణి' వేలం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్, పాల్గొన్న అధికారులు

- రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం : జూన్ 5 నుంచి ధరణి టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లు, వివిధ దశల్లో పూర్తయిన ఇళ్లను వేలం పాట ద్వారా విక్రయిస్తామని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం ప్రీ బిడ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 5 నుంచి 8వ తేదీ వరకు కలెక్టరేట్‌లో ఉదయం 9 గంటల నుంచి వేలం పాట కొనసాగుతుందన్నారు. రూ. 10వేలు కలెక్టర్, కామారెడ్డి పేరుపై డీడీ రూపంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు తమ వెంట ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా లాంటి గుర్తింపు పత్రాలు తీసుకురావాలన్నారు. 100 గజాల ప్లాటు రూ. 8లక్షలతో రిజిస్ట్రేషన్ చార్జీలు కలుపుకొని సొంతం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. 44వ జాతీయ రహదారి నుంచి 200 మీటర్ల దూరంలో ధరణి టౌన్‌షిప్ ఉందన్నారు. ఎలాంటి చిక్కులు లేని ఓపెన్ ప్లాట్లు, వివిధ దశలో నిర్మాణం పూర్తయిన ఇళ్లు వేలం పాటలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో రవీందర్, రాజీవ్ స్వగృహ ఏజీఎం సత్యానారాయణ, పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సవరించాలి..

ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితాలో తప్పుల సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమీక్ష నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకటికి మించి పోర్షన్‌లు ఉండే ఇల్లు గానీ, అపార్ట్‌మెంట్‌లలో గానీ ఒకే ఇంటి నంబర్‌పై వేర్వేరు కుటుంబాలు ఓటర్లుగా నమోదైనట్లయితే ప్రతి ప్లాట్, పోర్షన్‌లలో ఉంటున్న కుటుంబానికి ఒక ఇంటి నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఇంటి నంబర్, సరైన చిరునామా అప్‌డేట్ చేయడంలో స్థానికంగా ఉండే బీఎల్‌వోలు సహకారం అందిస్తారని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, అధికారులు నవీన్ కుమార్, నరేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం అన్‌లోడింగ్ త్వరితగతిన జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: రైస్ మిల్లర్లు ధాన్యం అన్‌లోడింగ్ త్వరితగతిన జరిగేలా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైస్ మిల్లర్లు తమ లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. గత రబీకి సంబంధించిన సీఎంఆర్ బియ్యంను ఎఫ్‌సీఐకి ఈనెల 28 లోగా అందజేయాలని రైస్‌మిల్లుల యజమానులకు సూచించారు. సమావేశంలో డీఎస్‌వో పద్మ, డీఎం అభిషేక్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

జిల్లా పోలీసుశాఖ క్రీడలు ప్రారంభం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జిల్లా పోలీసుశాఖ క్రీడలను గురువారం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుశాఖ క్రీడలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయని తెలిపారు. క్రీడలు పోలీస్ శాఖ వారికి మానసికంగా ధృడపరచడమే కాకుండా ఒత్తిడి తగ్గించడానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అన్యోన్య, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డీఎస్పీలు, క్రీడల్లో పాల్గొనే ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

సీఎం సమావేశానికి హాజరైన కలెక్టర్, ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సచివాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లతో నూతన సచివాలయం ఆవరణలో సీఎం కేసీఆర్ ఫొటో దిగారు.

అన్ని రంగాల్లో రాష్ట్రం ముందడుగు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- బిచ్కుందలో భారీ జాబ్ మేళా
- ఇంటర్వ్యూకు 1,100 మంది హాజరు, 550 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే, పాల్గొన్న నాయకులు

బిచ్కుంద(జుక్కల్): అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగ ఉపాధి కల్పన తదితర అన్ని రంగాల్లో రాష్ట్రం ముందుందని, బంగారు తెలంగాణ వైపు అడుగులు పడ్డాయని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. గురువారం బిచ్కుందలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిని చూసి ఇంటర్నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడుల కోసం ముందు వస్తున్నాయన్నారు. జుక్కల్ నియోజక వర్గంలోని నిరుద్యోగుల కోసం ఆయా కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించి 2వేల మందికి ఉపాధి కల్పించాలని మంత్రి కేటీఆర్‌ను కోరడంతో స్పందించి జాబ్‌మేళాకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్ డిగ్రీ, డిప్లొమా, పీజీ, బీటెక్ తదితర కోర్సులలో చదువుల ఆధారంగా ఈ జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో ఐటీ కంపెనీలతో పాటు డాటా ఎంట్రీ, సేంద్రీయ వ్యవసాయం, మెడిసిన్, హెల్త్‌కేర్, డ్రైవింగ్ ఇతర రంగాలలో ఉన్న కంపెనీల ప్రతినిధులు వచ్చారన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీపీలు అశోక్, ప్రతాప్‌రెడ్డి, యూత్ నాయకుడు ఎమ్మెల్యే తనయుడు హరీశ్‌సింధే, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్, బీఆర్‌ఎస్ నాయకులు నాల్చర్ రాజు, గంగాధర్, సాయాగౌడ్, నీలు పటేల్ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు అపూర్వ స్పందన

జాబ్ మేళాకు యువతీ, యువకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. 51 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 1100 మందికి హాజరయ్యారు. వీరిలో 550 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 390 మందికి కంపెనీల ఆఫర్ లేటర్లు ఇచ్చారు. మిగతా దరఖాస్తులు పరిశీలించి ఎంపిక చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఆనందంగా ఉంది



జాబ్ మేళా నిర్వహించి ఎమ్మెల్యే హన్మంత్ సింధే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారు. నాకు హెల్త్‌కేర్ కంపెనీలో అవకాశం లభించింది. రూ. 30వేల వేతనం వచ్చింది. చాలా ఆనందంగా ఉంది.

– శంకర్, గాలీపూర్, నిజాంసాగర్ మండలం

నిరుద్యోగులకు మంచి అవకాశం



జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగులకు మంచి అవకాశం కల్పించారు. నేను డిగ్రీ చదువుతున్నాను. మా ప్రతిభ ఆధారంగా ఉద్యోగం లభిస్తుంది. ప్రతి సంవత్సరం ఇలాగే జాబ్ మేళా నిర్వహించి అవకాశం కల్పించాలని కోరుతున్నాం.

– నితిన్, కాస్లాబాద్

ఏకవాక్య తీర్మానం..

- తెయూ వీసీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిర్ణయం
- కొత్త సచివాలయంలో వర్సిటీ 59వ పాలకమండలి సమావేశం
- 55, 56, 57, 58 ఈసీ సమావేశాల తీర్మానాలపై సమీక్ష
- మళ్లీ జూన్ 3న 60వ సమావేశం
- రిజిస్ట్రార్‌గా యాదగిరి కొనసాగింపు..
- కొన్ని గంటల ముందు ముగ్గురి పేర్లను ఈసీ సభ్యులకు ప్రతిపాదించిన వీసీ



ఈసీ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రెటరీ కరుణ తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అక్రమాలు, అవకతవకలకు పాల్పడిన తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ రవీందర్ గుప్తాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ పాలకమండలి ఏకవాక్య తీర్మానం చేసింది. గురువారం హైదరాబాద్‌లోని కొత్త సచివాలయంలో తెయూ 59వ పాలకమండలి సమావేశం జరిగింది. వీసీ హాజరు కాకపోవడంతో సమావేశానికి ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ చైర్మన్‌గా వ్యవహరించారు. గత నెల 19, 26, ఈ నెల 5, 12వ తేదీల్లో వరుసగా నిర్వహించిన 55, 56, 57, 58 సమావేశాల్లో చేసిన తీర్మానాల విషయమై సమావేశంలో సమీక్షించారు. 60వ సమావేశాన్ని జూన్ 3న నిర్వహించాలని, అదే విధంగా వర్సిటీకి రిజిస్ట్రార్‌గా యాదగిరిని కొనసాగించాలని నిర్ణయించారు. అయితే ఈ నెల 15న వర్సిటీలోని రిజిస్ట్రార్ గదికి తాళం తీయించకుండా చేయడంతో అప్పటి నుంచి రిజిస్ట్రార్ యాదగిరి ఆ చాంబర్‌కు రావడం లేదు.

ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి యాదగిరి కొనసాగింపు గురించి ప్రస్తావించారు. అయితే సమావేశానికి యాదగిరి హాజరు కాలేదు. ఇదిలా ఉండగా వీసీ వ్యవహారాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. తగిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం.

వీసీకి సన్నిహితుల పేర్లు..

తాజా పాలకవర్గ సమావేశం నేపథ్యంలో బుధవారం సాయంత్రం వీసీ రవీందర్, రిజిస్ట్రార్‌గా యాదగిరికి బదులు మరో ముగ్గురి పేర్లను వాట్సాప్ ద్వారా ఈసీ సభ్యులకు ప్రతిపాదించడం విశేషం. ఇందులో చంద్రశేఖర్, రాంబాబు, గతంలో పాలక మండలి తొలగించిన కనకయ్య పేర్లు ఉన్నాయి. వీళ్లలో కనకయ్యను అవినీతి, అక్రమాల నేపథ్యంలో గతంలోనే ఈసీ తొలగించింది. కనకయ్యను సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నిర్ణయించారు. ఇక రాంబాబు కూడా కనకయ్యలాగే వీసీకి అత్యంత సన్నిహితుడు. ఇక చంద్రశేఖర్ విషయానికి వస్తే మాత్రం వీసీతో ఏమాత్రం పొసగని వ్యక్తి. చంద్రశేఖర్‌కు షోకాజ్ నోటీసులు ఇస్తానని వీసీ ఇప్పటికే రెండుసార్లు ప్రకటించారు. అలాగే చంద్రశేఖర్ సర్‌నేమ్ తేడా ఉందంటూ ఆయన అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను వీసీ మీడియాకు ప్రకటించడంతో పాటు పీఆర్ వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేయించడం గమనార్హం. అయితే ఈసీ సభ్యులకు, చంద్రశేఖర్‌కు మధ్య వైరం సృష్టించేందుకే వీసీ తనకు సన్నిహితులైన ఇద్దరి పేర్లతో పాటు ఈ పేరును ప్రతిపాదించినట్లు వర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా విషయాలపై ఈసీ సభ్యులు మాత్రం స్పందించలేదు.

■ పాలక మండలి సమావేశంలో సమీక్షించిన అంశాల్లో వీసీ అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు కేసులు, ముగ్గురు రిజిస్ట్రార్ల నుంచి దుర్వినియోగమైన నిధుల రికవరీ, విద్యావర్ధిని సస్పెన్షన్, సర్వీసు పుస్తకాల టాంపరింగ్ అలాగే కనకయ్యపై పెట్టాల్సిన క్రిమినల్ కేసులు, బడ్జెట్, ఐదుగురు సభ్యుల బృందం చేయాల్సిన దర్యాప్తు తదితర అంశాలు ఉన్నాయి. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, పాలకమండలి సభ్యులు వసుంధరాదేవి, గంగాధర్‌గౌడ్, మారయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, నసీమ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స.హ. చట్టం సామాన్యుడి ఆయుధం



కామారెడ్డి అర్బన్: అవినీతిని అంతం చేసేందుకు సమాచార హక్కు చట్టం సామాన్యుడికి ఆయుధం లాంటిందని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. కామారెడ్డిలోని విజ్ఞాన భారతి డిగ్రీ కళాశాలలో గురువారం సహ చట్టంపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అనేక అవినీతి కుంభకోణాలు ఆర్‌టీఐ చట్టం ద్వారానే బయట ప్రపంచానికి తెలిసిందన్నారు. జోనల్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు షాబానా బేగం, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు లింగం, ప్రతినిధులు పాల్గొన్నారు.

27న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం 27న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పరమేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళా నాలుగు వివిధ కంపెనీలతో నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు డిగ్రీ చదివి, 32ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు నిజామాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయంలో 27న ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలన్నారు. బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్స్ తీసుకరావాలన్నారు. వివరాలకు 8099793317, 6305743423, 9959456793 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆర్‌వోబీ-771పై బీటీ రోడ్డు



సుభాష్‌నగర్: ఆర్మూర్ మండలంలోని గోవిందపేట్ ఆర్‌వోబీ-771పై ఎంపీ అర్వింద్ ధర్మపురి చొరవతో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. మూడు నెలల క్రితమే ఆర్‌వోబీని ఎంపీ ప్రారంభించిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపట్టడంతో మూడు నెలలకే కంకర తేలింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎంపీ అర్వింద్ సంబంధిత కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. వారం రోజుల్లోగా గోవింద్‌పేట్ ఆర్‌వోబీపై బీటీ రోడ్డు వేయాలని, లేకుంటే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. అదేసమయంలో రైల్వే అధికారులపై ఒత్తిడి పెంచారు. వారం రోజులుగా ప్రతిరోజు రైల్వే అధికారులు, కాంట్రాక్టర్‌తో సంప్రదిస్తూనే బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలకు స్పందించి ఆర్‌వోబీపై బీటీ రోడ్డు వేయించినందుకు ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడి జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో 2007-08లో 10తరగతి చదివిన విద్యార్థులు ఇన్నేళ్లకు కలుసుకొని, ఆనాటి తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగాక్షేమాలను అడిగితెలుసుకొని ఆనందాలను పంచుకున్నారు.

ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయని అధికారులు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 20 రోజుల్లో 12 మూగ జీవాల మృతి



ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి తండాలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు (ఫైల్)

ఎల్లారెడ్డిరూరల్: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూగ జీవాలు బలైపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం, తెగి కిందపడ్డ విద్యుత్ వైర్లను సకాలంలో సరి చేయకపోవడం వంటి తదితర కారణాల వల్ల ఉమ్మడి జిల్లాలో 20 రోజుల్లో 12 మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. ఇందులో ఎక్కువ భాగం పాడి గేదెలు ఉండటంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 5న నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలలోని పడకల్‌లో అటవీ ప్రాంతం నుంచి మేతకు వచ్చిన నెమలికి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. 6న సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన పాడి రైతులు లచ్చయ్య, రాములుకు చెందిన 3 పాడి గేదెలు పొలంలో తెగిపడ్డ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందగా, అదే రోజు ఎల్లారెడ్డి పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలు తగిలి మేక మృతి చెందింది. 7న లింగంపేట మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డికి చెందిన గేదె మేతకు వెళ్లగా పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అదే రోజున కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన విశ్వనాథ్ అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దనున్న వైరు తగిలి మృత్యువాత పడింది. 14న ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి తండాకు చెందిన విస్లావత్ నాయక్‌కు చెందిన ఎద్దు, ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్ గ్రామంలోని గులాంకు చెందిన రెండు పాడి గేదెలు కింద పడిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాయి. 22న ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డితండాకు చెందిన రాములు అనే పాడి రైతుకు చెందిన ఆవు, 23న ఇందల్వాయి మండలంలోని మేఘ్యానాయక్ తండాలోని పుర్యా నాయక్‌కు చెందిన గేదె విద్యుదాఘాతంలో మృతి చెందాయి. ఇలా రోజూ ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు నివారణ చర్యలు తీసుకోవడం లేదు.

మేతకు వెళ్లిన సమయంలో..

మేతకు వెళ్లిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్ వైరు తగిలి ఎద్దు మృతి చెందింది. రూ. 60 వేలు వరకు నష్టం వాటిల్లింది. నాకు జరిగిన నష్టాన్ని ఎవరు చెల్లిస్తారు. ట్రాన్స్‌కో అధికారులు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– విస్లావత్ నాయక్, తిమ్మారెడ్డితండా

కంచె ఏర్పాటు చేయాలి..

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయాలి. గ్రామ శివారులో ఉన్న పొలంలో తన ఆవు మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్దనున్న వైరు తగిలి మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

–రాములు, తిమ్మారెడ్డితండా

రైతులే జాగ్రత్త తీసుకోవాలి

పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. కొంత అప్రమత్తంగా ఉంటే నష్టాన్ని నివారించవచ్చు.

– గణేష్, విద్యుత్ డీఈ, ఎల్లారెడ్డి

జాతీయ జట్టుకు జిల్లా క్రీడాకారిణులు



క్రీడాకారిణులను అభినందిస్తున్న జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్ తెలిపారు. మండలంలోని ధర్మారం(బి)లో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులను వారు అభినందించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన అండర్ -15 బాలికల భారత జట్టు ఎంపిక పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు పాల్గొని చక్కని ప్రతిభ కనబర్చారు. వారిలో గుగులోత్ సౌందర్య (సాంఘిక సంక్షేమ పాఠశాల, సుద్దపల్లి), గోక సాత్విక (సాంఘిక సంక్షేమ పాఠశాల, సుద్దపల్లి), గోక శ్రావిక (సాంఘిక సంక్షేమ పాఠశాల, సుద్దపల్లి), సుంపాక సౌమ్యరాణి (సాంఘిక సంక్షేమ కళాశాల, తాడ్వాయి), దాసరి సరియు (సాంఘిక సంక్షేమ పాఠశాల, ధర్మారం(బి) భారత జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్‌లోని ఆర్‌డీటీ క్రీడా మైదానంలో ఈనెల 26నుంచి జూన్ 2వరకు జరగనున్న శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జూన్ 13నుంచి 17వరకు తైవాన్ దేశంలోని తైపీలో జరగనున్న అండర్-15 ఏసియన్ ఛాంపియన్‌లో భారతజట్టు సభ్యులుగా పాల్గొంటారని వారు తెలిపారు. ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, సుజాత, అకాడమీ కోచ్ నరేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక





అమూల్య.. కృష్ణవేణి.. మనీష్

పెర్కిట్(ఆర్మూర్)/జక్రాన్‌పల్లి/ఇందల్వాయి: ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అమూల్య జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మధు గురువారం తెలిపారు. ఇటీవల వరంగల్ జిల్లాలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో అమూల్య ప్రతిభ చూపిజాతీయ స్థాయి ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుగ్లీలో ఈ నెల 28నుంచి జూన్ ఒకటి వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన నాయిక మనీష్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ యాదగిరి తెలిపారు. ఇందల్వాయిలోని ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాల విద్యార్థిని కృష్ణవేణి అండర్-16 జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ ప్రోగ్రాం శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు ఆర్ఎం ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలు, సూచనలను, ప్రయాణంలో కలిగిన ఇబ్బందులపై వాట్సాప్ నెంబర్లకు మెసేజ్ చేయగలరని తెలిపారు.

రీజినల్ మేనేజర్, నిజామాబాద్	9959226011
డిపో మేనేజర్, ఆర్మూర్	9959226019
డిపో మేనేజర్, బోధన్	9959226001
డిపో మేనేజర్,నిజామాబాద్-1	9959226016
డిపో మేనేజర్, నిజామాబాద్-2	9959226017
డిపో మేనేజర్, కామారెడ్డి	9959226018
డిపో మేనేజర్, బాన్సువాడ	9959226020

క్రైం కార్నర్

నర్సాగౌడ్‌ది ఆత్మహత్యే

- బలవన్మరణానికి ప్రేరేపించిన ఐదుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సురేష్

కామారెడ్డి క్రైం: మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో సంచలనం రేపిన రామారెడ్డి మండలం సింగరాయపల్లి సర్పంచ్ అధికం మహేశ్వరి భర్త అధికం నర్సాగౌడ్ (48) అనుమానాస్పద మృతి కేసును కామారెడ్డి రూరల్ పోలీసులు ఛేదించారు. మృతుడు హత్యకు గురికాలేదని, ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు గురువారం కామారెడ్డి డీఎస్పీ సురేష్ వివరాలు వెల్లడించారు. నర్సాగౌడ్ 15 సంవత్సరాల నుంచి గ్రామ రాజకీయాలలో చురుగ్గా ఉంటూ కీలకంగా మారాడు. దీంతో అతడిని ఎలాగైనా రాజకీయంగా దెబ్బకొట్టాలని గ్రామానికి చెందిన చెన్నం నర్సారెడ్డి, అధికం సత్యగౌడ్, తోట లింగంలు భావించారు. ఈక్రమంలో ఈ నెల 14న గ్రామంలో జరిగిన కమిటీ మీటింగ్‌లో నర్సాగౌడ్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడారని డీఎస్పీ తెలిపారు. అంతేకాకుండా వాట్సప్ గ్రూపులలో నర్సాగౌడ్‌ను కించపరిచే విధంగా మెసేజ్‌లు పెట్టారని వెల్లడించారు. వారికి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, శ్యామగంటి నరేష్‌లు సహకరించారని తెలిపారు. దీంతో జరిగిన అవమానాన్ని భరించలేకనే నర్సాగౌడ్ కామారెడ్డి గుమస్తా కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో ఈనెల 22న రాత్రి గుర్తు తెలియని విష పదార్థం తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. నర్సాగౌడ్‌ను తీవ్ర మనోవేదనకు గురిచేసి అతడి ఆత్మహత్యకు కారణం అయిన ఐదుగురిపై కేసు నమోదు చేసి, గురువారం అరెస్ట్ చేశామన్నారు.

చార్‌ధామ్ యాత్రలో గుండెపోటుతో మృతి



సత్యనారాయణ (ఫైల్)

ఖలీల్‌వాడి : నిజామాబాద్ నగరంలోని సీతారాం నగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఎన్‌సీసీ ఆఫీసర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ చార్‌ధామ్ యాత్రలో భాగంగా గుండెపోటుతో గురువారం మృతిచెందారు. వారం క్రితం ఆయన చార్‌ధామ్ యాత్రకు బయలుదేరారు. గురువారం కేదారీనాథ్ సమీపంలోని రాంపూర్ ప్రాంతంలో వాతావరణం అనుకూలించక శ్వాస ఇబ్బందిగా మారి గుండెపోటు రాగా అక్కడే మృతి చెందారు. ఆయన 2008 నుంచి 2013 వరకు నగరంలోని మానిక్ భవన్ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయులుగా పని చేశారు. 1985 నుంచి 2011 వరకు ఎన్‌సీసీలో చీఫ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. అందరితో కలివిడిగా ఉంటూ సౌమ్యుడిగా పేరున్న ఆయన మృతి పట్ల ఎన్‌సీసీ అధికారులు, మాణిక్ భవన్ స్కూల్ ఉపాధ్యాయులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా నుంచి సుమారుగా 300 మంది యాత్రకు వెళ్లినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. నగరంలోనే 100 వరకు బ్యాచ్‌ల వారీగా వెళ్లినట్లు సమాచారం.

రెగ్యులరైజ్ చేసే వరకు పోరాడుతాం

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసే వరకు పోరాడుతామని, తమ నిరసన కొనసాగుతుందని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు తెలిపారు. తెయూ క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్ కాలేజ్ భవనం ఎదుట గురువారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎంసెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన ఎస్ఆర్ విద్యార్థులతో జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి, తదితరులు




సాత్విక్ స్నేహవర్మ

నిజామాబాద్‌అర్బన్: ఎంసెట్ ఫలితాల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యార్థులు సత్తా చటారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి ఉత్తమ ర్యాంకులు సాధించారు. కాకతీయ కళాశాలలోని 70 మంది విద్యార్థులు 25 వేల లోపు, 425 మంది విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారు. స్నేహ 1859 ర్యాంకు, సాత్విక్1942 ర్యాంకు, వైభవ్ 2246 ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా గురువారం కాకతీయ కళాశాలలో ఎంసెట్ ర్యాంకర్లను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కళాశాల డైరెక్టర్ రామోజీరావు మాట్లాడుతూ.. మరిన్ని ర్యాంకులు సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

ఎస్ఆర్ విద్యార్థుల ప్రభంజనం

నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన ప్రవళిక 2457ర్యాంకు, పావని 2950 ర్యాంకు, సాహితి 2991 ర్యాంకు సాధించారు. వీరితో పాటు మరో ఏడుగురు విద్యార్థులు 2000వేలకుపైబడి ర్యాంకులు సాధించారు. దీంతో వీరిని కళాశాల జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి సన్మానించారు.

వెక్టర్ కళాశాలకు ఉత్తమ ర్యాంకులు




నిశితరెడ్డి శ్రీహస్నిక

నగరంలోని వెక్టర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. సి.హెచ్.నిశిత రెడ్డి 1404, వినయ్ 1670 ర్యాంకులు సాధించారు. ఆర్యనగర్‌కు చెందిన శ్రీహస్నిక 2214 ర్యాంకు సాధించింది.

ధర్మారం (బి) గురుకులంలో..





జ్యోత్స్న సింధు సావిత్రి





శ్రీనిక సాయిపవన ధనలక్ష్మి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు ఎంసెట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్, మెడికల్ విభాగంలో జోత్స్న 2348 ర్యాంకు, సింధు 3339ర్యాంకు, సావిత్రి 3552 ర్యాంకు, ఎశ్రీనిక 3826 ర్యాంకు, సాయిపవన 4398 ర్యాంకు, శ్రీహిత 6567 ర్యాంకు, సంజన 7036 ర్యాంకు, సుష్మ 9103 ర్యాంకు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో ధనలక్ష్మి 10653 ర్యాంకు, శ్రీనిక 13187 ర్యాంకు, సిరివెన్నెల 13928 ర్యాంకు, కీర్తన 16124 ర్యాంకు, చామంతి 17613 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపక బృందం అభినందించారు.

కామారెడ్డి జిల్లాలో..



ఉత్తమ ర్యాంకర్లతో సాందీపని యాజమాన్యం



పూర్ణచందర్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న తండ్రి



అపర్ణకు స్వీట్ తినిపిస్తున్న తండ్రి




నాగిని ప్రీతి

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మెడిసిన్‌లో పూర్ణచందర్‌రెడ్డి 1061, సైదా సఫా అస్మా 1656, అరుణ్‌కుమార్ 6869, ఎస్. శ్రీజ 10716వ ర్యాంకును సాధించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో అపర్ణ 2956, సిందూరి 5768, సైదా ఫాతిమా 8908, హర్షిత 10951 ర్యాంకులను సాధించారు. వీరిని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, కళాశాల యాజమాన్యం పెంటయ్య, జనార్దన్, బాలాజీరావులు ఘనంగా సన్మానించారు. అలాగే శ్రీ ఆర్యభట్ట కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో నాగిని 3400, కీర్త 9322 ర్యాంకులను సాధించారు. కళాశాల కరస్పాండెంట్ గురువేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హన్మంత్‌రెడ్డిలు విద్యార్థులను అభినందించారు.

దోమకొండ విద్యార్థినికి 1547 ర్యాంకు



దోమకొండ: దోమకొండకు చెందిన పెద్దిరెడ్డి శతి ఎంసెట్‌లో 1547 ర్యాంకును సాధించింది. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి హనుమంత రెడ్డి సంపూర్ణల మూడో కూతురు శతి ఇంటర్ విద్యను హైదరాబాదులోని శ్రీ చైతన్య కళాశాలలో పూర్తిచేసింది. శతిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఆస్తి విషయమై అన్నపై తమ్ముడి దాడి

మాచారెడ్డి: అన్నపై సొంత తమ్ముడు దాడి చేసి గాయపర్చిన ఘటన గురువారం మాచారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.... గజ్యానాయక్ తండా చౌరస్తాలో నివాసముంటున్న సర్వేశ్, కిషోర్ అనే అన్నదమ్ములు గత రాత్రి ఆస్తి విషయమై గొడవ పడ్డారు. ఆ గొడవను దృష్టిలో పెట్టుకున్న తమ్ముడు కిషోర్ చౌరస్తాలోని ఓ హోటల్లో టీ తాగుతున్న అన్న సర్వేశ్ తలపై సుత్తితో దాడి చేయగా, అతడు తీవ్రంగా గాయపడ్డాడు. సర్వేశ్‌ను స్థానికులు ఓ ఆటోలో చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కిశోర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు.

ఇటుక ట్రాక్టర్ బోల్తా

- ముగ్గురు కార్మికులకు గాయాలు



మాచారెడ్డి: ఇటుకల లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండలంలోని మైసమ్మ చెరువు తండాలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రకు చెందిన మధుకర్, అవినాష్, సంకేష్‌లు కొన్నేళ్లుగా చౌరస్తాలోని ఓ ఇటుక బట్టీలో పని చేస్తున్నారు. వీరు ట్రాక్టర్‌లో ఇటుకను లోడ్ చేసుకొని మైసమ్మ చెరువు తండాకు వెళ్తుండగా మైసమ్మ చెరువు తండా రాజఖాన్‌పేట మధ్య ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్‌లో కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను తప్పించబోయి కారు బోల్తా



ప్రమాదంలో గాయపడిన జయశ్రీ

ఎల్లారెడ్డి: ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు బోల్తా పడిన ఘటన మండలంలోని తిమ్మారెడ్డిగేట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న కారుకు తిమ్మారెడ్డిగేట్ వద్ద ఎల్లారెడ్డి నుంచి నిజాంసాగర్ వైపు వెళ్తున్న బైక్ ఎదురుగా వచ్చింది. దీంతో బైక్‌ను తప్పించబోయిన ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న జయశ్రీ, సునీత, రూప్‌సింగ్, సర్దార్‌లకు గాయాలైనట్లు వారు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని 108లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు వారు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన ఒకరికి బైక్ అదుపుతప్పడంతో గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన లక్ష్మన్, ఆయన భార్య కవితకు పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ రావడంతో గురువారం మండల కేంద్రానికి వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో లక్ష్మన్ కాలుకు గాయాలు అయ్యాయి. 108 వాహనంలో ఆయనను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అనారోగ్య కారణంతో ఒకరి ఆత్మహత్య



వినయ్ మృతదేహం

మాక్లూర్: అనారోగ్య సమస్యలను తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన సంగి సత్యనారాయణ(44) గత కొంత కాలంగా షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి జబ్బులతో బాధపడుతున్నాడు. ఇటీవల జబ్బుల తీవ్రత ఎక్కువ కావటంతో తట్టుకోలేక గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులోని ఓ తుమ్మచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్యా సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక..

మాక్లూర్: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మండలంలోని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై యదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కృష్ణనగర్‌కు చెందిన అన్నే వినయ్(37)కు పాల వ్యాపారంలో నష్టం రావటంతో అప్పులు పెరిగి, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి అతడు పురుగుల మందు తాగి, ఇంటికి చేరుకున్నాడు. నోట్లో నుంచి నురుగులు రావటం తో కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు, భార్య గంగాభవాని ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

ఎల్లారెడ్డి: పట్టణంలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేష్ గురువారం తెలిపారు. లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన దారబోయిన శ్రీకాంత్ (26) గతంలో ఎల్లారెడ్డిలోని మీసేవా కేంద్రంలో రెండుమార్లు చోరీకి పాల్పడగా, ఇటీవల పట్టణంలోని బీసీ కాలనీలో ఓ ఇంటిలో చోరీకి యత్నించారు. దీంతో అతడిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఒకరి అదృశ్యం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కన్‌కల్ గ్రామానికి చెందిన మంగళి స్వామి(32)అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. స్వామి తన భార్యతో గొడవ పడి ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటికీ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం స్వామి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.